# సాలెగూళ్ళు

## వి. సత్యనారాయణ



మద్రాసు సెంట్రల్ స్టేషన్‌లోకి వచ్చి ఆగింది సర్కార్ ఎక్స్‌ప్రెస్. కంపార్టుమెంట్‌లోని జనమంతా హడావిడిగా దిగడం మొదలుపెట్టారు. నేను కూడా నా సూటుకేసు, ఎయిర్‌బాగ్ అందుకుని ప్లాట్‌ఫాం మీదికి అడుగుపెట్టాను. రెండేళ్ళ తరువాత ఇప్పుడే మళ్ళీ నేను మద్రాసు రావడం.

సెంట్రల్ స్టేషను నుంచి బయటకు వచ్చిన నన్ను చూసి ఆటోవాళ్ళు చుట్టుముట్టి 'ఎక్కడికి పోవాలి సార్' అని తమిళంలో అడగడం మొదలుపెట్టారు. నా మిత్రులు చాలామంది సినిమా పరిశ్రమలో వివిధ శాఖలలో పనిచేస్తున్నారు. ఉద్యోగంలో స్థిరపడేవరకు అప్పుడప్పుడు మద్రాసు రావడం, మిత్రులందరినీ కలుసుకొని వారితో సరదాగా కాలక్షేపం చేయడం రివాజు నాకు.

ఈసారి నేను మద్రాసు రావడానికి ముఖ్య కారణం మా మావయ్యని అనారోగ్య కారణంగా విజయా హాస్పిటల్‌లో చేర్చారు. ఆయనను ఒకసారి పరామర్శించి పోదామని ఆఫీసుకు మూడురోజులు సెలవు పెట్టి బయలుదేరి వచ్చాను. ఒక ఆటోవాడితో బేరం కుదుర్చుకొని టినగర్‌లోని రోహిణీ ఇంటర్నేషనల్‌కు చేరుకొన్నాను. నా కార్యక్రమాలన్నీ ముగించుకొని ఆటోలో విజయా హాస్పిటల్‌కు చేరుకున్నాను. మా మావయ్యగారిని ఏ రూములో అడ్మిట్ చేసుకున్నది రిసెప్షన్‌లో ఎంక్వయిరీ చేసి ఆ రూముకు వెళ్ళాను. మా అత్తయ్య నన్ను చూడగానే కళ్ళనీళ్ళు పెట్టుకొంది. ఏమీ ఫరవాలేదని ఆమెను ఓదార్చి మా మావయ్యకు ధైర్యం చెప్పి మిగతా బంధువులతో కూడా మాట్లాడి తిరిగి రూముకు చేరుకున్నాను.

ఆ రోజు సాయంత్రం సరదాగా పారిస్ కార్నర్‌కు వెడదామనిపించింది. డ్రెస్ చేసుకొని బస్‌లో పారిస్ చేరుకున్నాను. పారిస్ రోడ్ ఎప్పుడూ రద్దీగా జనంతో

కళకళలాడుతూ వుంటుంది. పిన్నీసు దగ్గర్నుంచి అన్ని రకాల వస్తువులు అక్కడ దొరుకుతాయి. కొంచెం ముందుకు పోతే బీచ్ రోడ్‌కు వెళ్ళే దారిలోని షాపులలో స్మగుల్డ్ గుడ్స్ కూడా దొరుకుతాయి. పారిస్ రోడ్ మీద నడుస్తున్న నాకు 'షర్టింగ్ పీస్ ట్వంటీ రూపీస్', 'షర్టింగ్ పీస్ ట్వంటీ రూపీస్' అన్న కేకలు వెవిన బడ్డాయి. నడుస్తున్న నేను టక్కున ఆగిపోయాను. ఆ కేకలు వచ్చిన దిక్కుగా చూశాను. ఒకతను ఫుట్‌పాత్ మీద ఒక టేబిల్ లాంటిది పరచుకొని దానిమీద అన్ని రకాల షర్టింగ్ పీస్‌లు పాక్ చేసినవి పెట్టుకొని అరుస్తున్నాడు. వాడి చుట్టూతా కొంతమంది మనుషులు నుంచున్నారు. ఆంధ్రా నుంచి వచ్చిన ఒక తెలుగువాడు కొనడానికి వచ్చినట్టున్నాడు. అతనితో వాళ్ళు ఏదో మాట్లాడుతున్నారు. ఇతను తల ఊపుతున్నాడు. ఆ దృశ్యాన్ని చూసిన నాకు ఏదో ఫ్లాష్ బాక్ గుర్తుకొచ్చింది.

* * *

ఒక రోజు ఆదివారంనాడు నా ఫ్రెండ్ ఇంటికి వెళ్ళాను. వాడు తన డ్రాయింగ్ రూమ్‌లో కట్ డ్రాయర్‌తో కూర్చొని వున్నాడు. ఆ స్థితిలోవున్న వాణ్ణి చూసి ఆశ్చర్యపోయాను. వాడు గబుక్కున లుంగీ చుట్టుకొని వచ్చి "రారా లోపలికి" అంటూ ఆహ్వానించాడు నన్ను. నేను లోపలికి వెళ్ళి సోఫాలో కూర్చున్నాను. ఇంతలో వాళ్ళ రెండేళ్ళబ్బాయి కూడా కట్ డ్రాయర్‌తో లోపలికి వచ్చాడు. ఇంతలో వాళ్ళావిడ నేను వచ్చానని గ్రహించింది కాబోలు "కాఫీ తీసుకోండి అన్నయ్యగారూ" అంటూ కాఫీ కప్పుతో వచ్చింది. ఆమె ధరించిన జాకెట్ వంక చూసి ఆశ్చర్యపోయాను ఈసారి.

"ఏరా శర్మా! ఈ మధ్య వ్యాపారంలో లాభాలు బాగా గడిస్తున్నావా ఏమిటీ? కట్ డ్రాయర్లకు, జాకెట్లకు కూడా టెరికాటన్ పీసులు వాడేస్తున్నావు" అన్నాను నేను. ఆ మాటకు వాడు గలగలమని నవ్వాడు. అంతలోనే ఏదో ఆలోచిస్తున్నట్టుగా ముఖం పెట్టుకొని "అదంతా ఒక పెద్ద కథ లేరా" అన్నాడు. "అది సరే

## జైలు సాహిత్యం

జైళ్ళు —
కవితలు వినిపిస్తాయి!
కథలు వివరిస్తాయి!!

వాటిల్లో —
వసంతాలుండవు!
విరహవేదనలుండవు!!
అవి —
అరుణోదయాన్ని
ఆలపిస్తాయి!
అనంత స్వేచ్ఛను
ఆశిస్తాయి!!
అవి —
శృంఖలాలను గర్జిస్తాయి!
సమైక్యతను కాంక్షిస్తాయి!!
అవి —
జనాలకు జానపదులవుతాయి!
జాగృతిని కలిగిస్తాయి!!
అవి —
మృత్యువును గేలిచేస్తాయి!!
రక్తతర్పణను కీర్తిస్తాయి!!
అవి —
చీకట్లో కిరణాలు!
చైతన్యపు పవనాలు!!


— ఆప్త చైతన్య

శేహోయ్! విషయం వివరంగా చెప్తే విని సంతోషిస్తాను" అన్నాను నేను. "ఏమీ లేదురా! నేను ఆ మధ్య మద్రాస్ వెడుతున్నానని నీతో చెప్పాను గుర్తుందా?" అని అన్నాడు వాడు.

"అవును, అయితే?"

"నేను మద్రాసు వెళ్ళినప్పుడు అలా పారిస్ కార్నర్‌కు

సరదాగా బయలుదేరాను. 'షర్టింగ్ పీస్ ట్వంటీ రూపీస్', 'షర్టింగ్ పీస్ ట్వంటీ రూపీస్' అంటూ ఒకడు అరవడం మొదలుపెట్టాడు. నేను అదేమిటో చూద్దామని అక్కడకు వెళ్ళాను. ఆ చొక్కాగుడ్డలు అమ్మేవాడి చుట్టూ చాలామంది జనం మూగి వున్నారు. వాడు నన్ను చూసి 'తీసుకోండి సార్' అంటూ అడిగాడు. గుడ్డలు చూడడానికి బాగానే వున్నాయి. షర్టింగ్ పీసు ఇరవై రూపాయిలే. ఆ గుంపులోని వ్యక్తి ఒకడు నా ఎదురుగుండా వంద రూపాయలిచ్చి ఐదు ముక్కలు తీసుకున్నాడు. ఆ పక్కన వున్న మరొకడు 'మీరూ తీసుకోండి సార్' అంటూ నన్ను వత్తిడి చేయడం మొదలుపెట్టాడు. ఆ చుట్టుపక్కలవాళ్ళు కూడా తీసుకోండి ఫరవాలేదు అంటూ ఎంకరేజి చేయడం మొదలుపెట్టారు. ఒక పాకెట్ ఊడదీసి రెండు మీటర్లు చూస్కోండి' అంటూ కొలిచి చూపించాడు ఆ గుడ్డలమ్మే వ్యక్తి. పోనీలే మూడు ముక్కలు తీసుకుందాం అనిపించి మూడు పాకెట్లు తీసుకొన్నాను. కానీ వాళ్ళ వ్యవహారం చూస్తుంటే మనస్సులో ఏదో సందేహం పీడిస్తూనే వుంది. మూడు ముక్కలికి అరవై రూపాయలిచ్చాను. 'ఏమిటీ అరవై ఇచ్చారు' అన్నాడు వాడు. 'అవునయ్యా! షర్టింగ్ పీస్ ఇరవై కదా! మూడింటికి అరవై ఇచ్చాను' అని అన్నాను నేను. 'భలే వాళ్ళే! మీటరు ఇరవై సార్. మీ షర్టింగ్స్‌కు నూట ఇరవై రూపాయలివ్వండి' అని కోపంగా అన్నాడు వాడు. దాంతో నాకు చిర్రెత్తుకొచ్చింది. ముందు షర్టింగ్ పీస్ ఇరవై అని చెప్పి తీసుకొన్నాక మీటరు ఇరవై అనడం నాకు కోపాన్ని తెప్పించింది. 'అయితే ఇవి నాకు అక్కర లేదు' అని అక్కడ వదిలిపెట్టి బయటకు రాబోయాను. దానితో వాడి చుట్టూతా వున్న వాళ్ళంతా ఏకమై నాతో యుద్ధానికి సిద్ధమయ్యారు. అప్పుడు నాకు అర్థమయింది ఆ చుట్టూ కొనడానికి వచ్చినవాళ్ళంతా వాడి మనుషులేనని. నా అనుమానం నిజమైంది. మోసం చేసి బతకడం వారి వృత్తి అని గ్రహించాను. నాకేమో తమిళం రాదాయె! ఎందుకులే గొడవ అని డబ్బు వాళ్ళ






ముఖాన కొట్టి ఆ మూడు ముక్కలు తీసుకొని బయ లకు వచ్చాను. మద్రాసు నుంచి తిరిగొచ్చాక పాకెట్స్ టైలరుకిచ్చి మూడు షర్టులు కుట్టమన్నాను. వాడు పాకెట్ ఊడదీసి గుడ్డ కొలిచి 'షర్టులు ఎవరికి సార్' అని అడిగాడు నన్ను. నాకే అన్నాను నేను. వాడు పగలబడి నవ్వాడు. 'భలేవారు సార్ ఈ మూడు పీసులు కలిపినా మీకు ఒక షర్టు కూడా రాదు' అన్నాడు నవ్వు ఆపుకుంటూ. మా టైలరు. దానితో నాకు మతి పోయింది. 'అదేమిటోయ్ ఒక్కొక్క పాకెట్ రెండు మీటర్లు వుండాలి' అని అన్నాను నేను. 'లేదు సార్, ఒక పాకెట్ అరమీటరుంది. కావాలంటే మీకు మూడు కట్‌డ్రాయర్స్ వస్తాయేమో' అని అన్నాడు వాడు. దానితో నేను ఎంత మోసపోయానో నాకు అర్థ మయింది. నా మీద నాకే జాలి వేసింది. అప్పుడే రెండు పాకెట్‌లు కట్ డ్రాయర్లుగా కుట్టించాను. ఒకటి మా ఆవిడకు కావాలంటే ఇచ్చాను. జాకెట్ కుట్టించుకుంది" అని తన కథను పూర్తిచేసిన శర్మ నుదుటను పట్టిన చెమటను టెరికాట్ కర్చీఫ్‌తో తుడుచుకున్నాడు. అప్పుడు వాడి ముఖాన్ని చూసిన నాకు నవ్వాగలేదు. వాడి దగ్గర శెలవు తీసుకొని ఇంటి ముఖం పట్టాను.

*    *    *

గతం నుంచి వర్తమానంలోకి వచ్చిన నేను ఆ బట్టలమ్మేవాడినే పరిశీలిస్తున్నాను. చేత్తో ఐదు పాకెట్లతో తిరిగి వస్తున్నాడు ఆ తెలుగాయన. నేను ఎదురువెళ్ళి 'హలో!' అంటూ పలుకరించాను. అతను నా వంక ప్రశ్నార్థకంగా చూశాడు. "మీరీ షర్టు పీసులు ఎంతకి కొన్నారు" అని అడిగాను. నేనూ తెలుగువాడినే అని గుర్తించిన అతను నవ్వుతూ "ముందు ఆ వెధవ ఇరవై అని చెప్పాడండి. తీసుకున్నాక నలభై అని చెప్పి రెండు వందలు వసూలు చేశాడు. తీసుకోనంటే దౌర్జన్యం చేసి మరీ అంటగట్టాడు" అన్నాడు దీనంగా అతను. "సరే లెండి! పీస్ ఎన్ని మీటర్లని చెప్పాడు" అని అడిగాను అతనిని. "రెండు మీటర్లని చెప్పాడండి" అని బదులు చెప్పాడాయన. దీన్నిబట్టి వాళ్ళ మోసం నిరాఘాటంగా సాగిపోతోంది అని గుర్తించాను. ఇటువంటివాళ్ళకు బుద్ధి చెప్పమని అంతరాత్మ ఘోషించడం మొదలు పెట్టింది. ఆ తెలుగాయన్ని నాతో రమ్మనమని చెప్పి ఒక టైలరు షాపుకు తీసుకు వెళ్ళాను. ఆ పీసులు ఎన్ని మీటర్లో కొలవమన్నాను. ఆ టైలరు ఒక పీసు కొలిచి "అరమీటరుంది సార్" అన్నాడు నాతో. ఆ మాట విన్న నా తోటి తెలుగాయన తెల్లమొఖం వేశాడు. "మరీ ఇంత మోసమా?" అని నోరు వెళ్ళబెట్టాడు. "మీ కెందుకు అనుమానమొచ్చింది సార్" అని నన్ను అడిగాడాయన. నేను శర్మకు ఎదురైన అనుభవాన్ని ఆయనకు వివరించి చెప్పాను. "మరిప్పుడు ఏం చేయాలి సార్! నాకు తమిళం రాదు. ఇదే మొదటిసారి నేను మద్రాసు రావడం. డబ్బు చాలా నష్టపోయాను. మీ సహాయం కావాలి" అంటూ నా చేతులు పట్టుకొన్నాడు. "సరే పదండి" అంటూ ఆయన్ని వెంటపెట్టుకొని అక్కడి కానిస్టేబుల్ సలహాతో పోలీసు స్టేషన్‌కు వెళ్లాను. సబ్ ఇన్‌స్పెక్టర్‌తో జరిగిన విషయాన్ని చెప్పాను. అతడు మాతో చాలా




మర్యాదగా మాట్లాడి కూర్చోమన్నాడు. డ్రాయర్ సొరుగు తీసి ఓ పాతిక చొక్కా గుడ్డలు బల్ల మీద పెట్టాడు. నేను నవ్వుతూ "మీరు కూడా ఇవి కొన్నారా?" అని జోక్‌గా అన్నాను సబ్ ఇన్‌స్పెక్టర్‌తో. అతను కూడా నాతో శృతికలిపి నవ్వుతూ "లేదండి. ఇలా మా దగ్గరికి చాలా కంప్లైంట్స్ వస్తుంటాయి. మీరు కొన్న చోటును, అమ్మిన మనిషిని గుర్తుపట్టగలరా?" అని ప్రశ్నించాడతను. "తప్పకుండా! ఇప్పుడతను అక్కడే వున్నాడు. ఈయన ఒక్కడే కాదండి. ఇలా చాలామంది వీళ్ళవల్ల మోసపోతున్నారు. మీరు వాళ్ళమీద కఠిన చర్య తీసుకోవాలి" అన్నాను నేను. "అలాగే, కానిస్టేబుల్ని పంపిస్తాను. ఆ మనిషిని గుర్తించండి" అని మాతో కానిస్టేబుల్ని పంపాడు సబ్ ఇన్‌స్పెక్టర్. కానిస్టేబుల్, నేను దూరంగా నుంచున్నాము. తోటి తెలుగాయన్ని ముందుగా పంపాము. అతడు వారి దగ్గరికి వెళ్ళి డబ్బు వాపసు ఇవ్వమన్నాడు. వాళ్ళతనితో దౌర్జన్యానికి దిగబోయారు. కానిస్టేబుల్‌తో "ఇప్పుడు మీరు వెళ్ళండి" అని సలహా ఇచ్చాను. కానిస్టేబుల్ అక్కడికి వెళ్ళాడు. డబ్బుతోపాటు ఆ షాపువాణ్ణి వెంటబెట్టుకొని స్టేషన్‌కు తీసుకొచ్చాడు కానిస్టేబుల్. సబ్ ఇన్‌స్పెక్టర్ అతనికి వార్నింగ్ ఇచ్చి సెల్లోకి పంపించాడు. అతడి దగ్గరినుంచి వసూలు చేసిన సొమ్మును మాకు తిరిగి ఇప్పించాడు. పోలీసులు ఇంత త్వరగా చర్య తీసుకొని నేరస్థుడికి గుణపాఠం నేర్పడం నాకు ఆశ్చర్యానందాలను కలి గించింది. పోలీసు డిపార్ట్‌మెంట్ మీద దిగజారిపోతున్న నా నమ్మకానికి ఈ సంఘటన ప్రాణం పోసింది. ఆ సబ్ ఇన్‌స్పెక్టర్‌కు ధన్యవాదాలు చెప్పి తోటి తెలుగాయనతోపాటు స్టేషన్ బయటకు వచ్చాను. వద్దంటు న్నా వినకుండా నన్ను హోటల్‌కు తీసుకువెళ్ళి తన కృతజ్ఞతలు చెప్పుకున్నాడాయన. తన అడ్రసు ఇచ్చి 'విజయవాడ వచ్చినప్పుడు తప్పకుండా మా ఇంటికి రావాలంటూ నన్ను ఆహ్వానించాడు. అలాగేనని అతనికి మాట ఇచ్చి, వీడ్కోలు తీసుకొని బీచ్ కేసి బయలు దేరాను. మద్రాసు శాంతోమ్ బీచ్‌లో కాసేపు గడిపి తిరిగి పారిస్ మీదుగా ఆటోలో వెడుతున్నాను. 'షర్టింగ్ పీస్ ట్వంటీ రూపీస్', 'షర్టింగ్ పీస్ ట్వంటీ రూపీస్' అన్న కేకలు వినబడుతున్నాయి నాకు. వారి కేకలకు ఆకర్షింపబడి అటుకేసి అడుగులు వేస్తున్నారు కొందరు. సాలీడు గూడు అల్లి ఎరకోసం పొంచి వుంటుంది. ఎర చిక్కగానే దాని మీదకు దాడి చేసి కడుపు నింపుకొంటుం ది. ఈ గూడులో సాలీళ్ళు చాలా వున్నాయి. వాటి మధ్యకు చేరుతున్న ఈ ఎరలను ఎవరు రక్షించగలరు? ఆ దృశ్యాన్ని చూస్తున్న నేను గాఢంగా నిట్టూర్చి ఆటోలోకి ఒరిగి కళ్ళుమూసుకున్నాను.

●

## చీకటి బావుంది

ప్రస్థానాపేక్షతో ఎద ఉరకలేస్తోంది
అర్థ శతాబ్ది బతుకు నేర్పింది పలాయనం
క్షుద్రత్వంలోంచి తలెత్తి అభిమాన భంగాలకు నిత్యం
బలయ్యి
ఘర్షించి ఘర్షించి మెదడు విరాపక్తమయింది.
మనసు ఆలోచనలు విడిచి శరీరం
పంచేంద్రియాల్ని విసర్జించి
శవయాత్ర సాగిస్తోంది నిర్విరామంగా
అనివార్య శాశ్వతత్వం ఒక్క మరణానికే
మనసు పొరలను కోస్తూ అట్టడుగున మొలకెత్తి
మృత్యువాంఛ అన్నింటినీ జయించింది.
మజిలీ లెన్నైనా మలుపులే
ముగింపు లేదు.
ఐహికానుభూతుల్ని నిష్క్రమణవాంఛ
దహిస్తోంది
మనుగడలో మరణ సంగీతం ప్రవహిస్తోంది.
చీకటే బావుంది.
అవును చీకటి బావుంది.

—'విశి'